## కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 3 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఓటమితో కార్యకర్తలెవ్వరూ మనోధైర్యాన్ని కోల్పోవద్దని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామన్నారు. పదవిలో లేకపోయినప్పటికీ బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ గెలిచిన నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని, ఘర్షణలకు దూరంగా ఉండాలని కోరారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. జిల్లాలో కూడా పార్టీ ఓడినంత మాత్రాన ఎవరు అధైర్యపడవద్దని, కార్యకర్తలకు తామంతా ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.

## వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్లటౌన్, డిసెంబర్ 3: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే తనను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. తన గెలుపులో భాగస్వాములైన పార్టీ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**నాయకుల సంబురాలు**

బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య గెలుపొందడంతో నాయకులు సంబురాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో బాణాసంచా కాల్చి, ఒక్కరికొకరూ స్వీట్లు తినిపించుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారికి అన్ని విధాలుగా సహకరించే యాదయ్య మళ్లీ గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, మోసిన్, రవి, యాదగిరి,విజయ్, మల్లేశ్ తదితరులున్నారు.

## కబేళాకు తరలిస్తున్న గోవుల పట్టివేత



గోవులను గోశాలకు తరలిస్తున్న గోసంరక్షకులు, పోలీసులు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 3: అక్రమంగా కబేళాకు తరలిస్తున్న గోవులను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మోహన్ కథనం ప్రకారం.. రమావత్ కిరణ్, శివ, గన్నీ అనే వ్యక్తులు ఆదివారం ఒడిశా నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు 71 ఆవులు, దూడలను అక్రమంగా తరలిస్తున్నారు. రామోజీఫిల్మ్ సిటీ గేటు వద్దకు రాగానే పశువులను తరలిస్తున్న వాహనాన్ని.. రామన్ గుచి శివరాజ్ ద్విచక్రవాహనదారుడు అనుమానంతో ఆపాడు. వాహనంలో పశువులను కబేళాకు తరలిస్తున్నట్లు గుర్తించాడు. వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు అక్కడకు చేరుకుని, పశువులను తరలిస్తున్న ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు. పశువులను గోశాలకు తరలించి, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-314353-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ డీహెచ్ చౌహాన్



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

# 38 ఏండ్ల తర్వాత కాంగ్రెస్ గెలుపు

- హస్తం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయం
- హామీలను నెరవేరుస్తా..
- నియోజకవర్గంలో కార్యకర్తల సంబురాలు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 3 : నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఘనవిజయం సాధించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై 40,127ఓట్లతో విజయం సాధించారు. మొదటి నుంచి ప్రతిరౌండ్‌లోనూ ఆయన ఆధిక్యత కనబర్చారు. పట్నం ఓట్ల లెక్కింపు ఆదివారం మంగల్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టారు. గత నెల 30న జరిగిన ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మొత్తం 3.27, 883ఓట్లు ఉన్నాయి. ఇందులో 2,45,105మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని విజయం వరించింది. ఈ ఎన్నికల్లో ఆయనకు 1,24,447ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 84,320 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌కు 15,064ఓట్లు, సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యకు 8,710 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి గొరిగె మల్లేశ్‌కు 2,556ఓట్లు వచ్చాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్‌రెడ్డి రంగారెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

**పటిష్టమైన బందోబస్తు మధ్య కౌంటింగ్..**

ఆదివారం సీవీఆర్ కళాశాలలో జరిగిన ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి ఓట్ల లెక్కింపు పటిష్టమైన బందోబస్తు మధ్య అధికారులు చేపట్టారు. శనివారం రాత్రి పోస్టల్ బ్యాలెట్‌ల ఓట్ల విషయంలో పెద్ద ఎత్తున గందరగోళం జరిగిన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఓట్ల లెక్కింపు విషయంలో అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మూడంచెల భద్రత మధ్యన కౌంటింగ్ నిర్వహించారు. కౌంటింగ్ ఏజెంట్లకు తప్పా..ఇతరులు ఎవ్వరినీ కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించలేదు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను రాచకొండ కమిషనర్ డీహెచ్ చౌహాన్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఎ

**సంబురాల్లో కాంగ్రెస్**

నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఘన విజయం సాధించటంతో ఆ పార్టీ నేతలు గ్రామాల్లో పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకొన్నారు. గ్రామాల్లో బాణసంచా కాల్చుతూ...బైకుర్యాలీ నిర్వహించారు. పలుచోట్ల స్వీట్లు పంచుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**ఏండ్ల తర్వాత**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 38 ఏండ్ల తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపుకోసం కార్యకర్తలు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ మద్దతుతో సీపీఎం అభ్యర్థి ఒక్కసారి గెలిచినప్పటికీ ఆ పార్టీ కార్యకర్తలు అంతగా సంతృప్తి చెందలేదు. 1985లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఏజీ కృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన వరుస ఎన్నికల్లో సీపీఎం, తెలుగుదేశం, టీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు.

**అనుకూలంగా బీజేపీ, సీపీఎం ఓట్లు**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ, సీపీఎం అభ్యర్థులు కూడా పోటీలో ఉన్నారు. ఆ పార్టీల అభ్యర్థులు తమ ఓటును తమవైపు తిప్పుకోవడంలో విఫలమయ్యారు. గత ఎన్నికల్లో బీజేపీకి 16వేల ఓట్లు, సీపీఎంకు 9 వేల ఓట్లు వచ్చాయి. కానీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీలు తమ ఓట్లను కాపాడుకోలేకపోయారు. ఆ ఓట్లు కాంగ్రెస్ గెలుపునకు దోహదపడ్డాయన్న చర్చ కూడా జరుగుతుంది.



ఇబ్రహీంపట్నంలోని సీవీఆర్ కళాశాలలో ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

### పోస్టల్ బ్యాలెట్‌లోనూ కాంగ్రెస్‌దే హవా

ఇబ్రహీంపట్నంరూరల్ : నియోజకవర్గంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌లోనూ కాంగ్రెస్ పార్టీ ఆధిక్యతను కొనసాగించింది. నియోజకవర్గంలో మొత్తం 2473మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో కాంగ్రెస్‌కు 1867ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 606ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో కూడా బీఆర్‌ఎస్‌కు అనుకున్న స్థాయిలో ఓట్లు రాలేదు.

### రంగారెడ్డికి 15 ఏండ్ల తర్వాత ..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి పదిహేనేండ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నం నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. అనంతరం 2014లో కాంగ్రెస్ టికెట్‌కోసం ప్రయత్నించినప్పటికీ ఆయనను మహేశ్వరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిపారు. 2018లో కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించగా.. టికెట్ రాకపోవటంతో 2018లో ఆయన బీఎస్పీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2023లో విజయం ఆయన సొంతమైంది. ఇబ్రహీంపట్నం ప్రజలు ఆయన నిరీక్షణకు పట్టం కట్టారు.

### కాంగ్రెస్‌కు కలిసొచ్చిన సైలెంట్ ఓట్లు

సైలెంట్ ఓటింగ్ కాంగ్రెస్‌పార్టీ గెలుపునకు దోహదపడింది. సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిపై ఆధారపడి బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. అయిప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా వీచిన సైలెంట్ ఓట్లలో భాగంగా ఇబ్రహీంపట్నంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలోని శివారు ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపారు. హైదరాబాద్ విశ్వనగరం చుట్టూ బీఆర్‌ఎస్ గెలుపొందినప్పటికీ హైదరాబాద్ శివారులో విస్తరించి ఉన్న ఆదిబట్ల, తుర్కయంజాల్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో కూడా ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థి ఊహించని రీతిలో విజయం సాధించారు. మహిళలు కూడా ఎక్కువగా కాంగ్రెస్ వైపే మొగ్గు చూపినట్లు స్పష్టమవుతోంది. నియోజకవర్గంలో 1,61,786 మహిళా ఓటర్లున్నారు. ఇందులో 1,21,483 ఓట్లు పోలయ్యాయి. ఇందులో అత్యధికశాతం మహిళా ఓటర్లు కాంగ్రెస్‌వైపే మొగ్గు చూపినట్లు స్పష్టమవుతున్నది. ఫార్మాసిటీ పరిసర గ్రామాలైన మేడిపల్లి, తాడిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద, నజ్దిక్‌సింగారం వంటి గ్రామాల్లో కూడా భూములు కోల్పోయిన రైతులు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొనట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా మార్పు రావాలని ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 500లకు గ్యాస్ సిలిండర్ వంటి ఉచిత పథకాల ఓటర్లను బాగా ఆకట్టుకున్నాయి. గత ఎన్నికల మాదిరిగా రెండు పార్టీల మధ్య ఐదు వేల నుంచి పదివేల ఓట్ల మెజార్టీతోనే ఎవరైనా గెలుస్తారని అందరూ భావించారు.ఊహించని రీతిలో కాంగ్రెస్‌పార్టీ భారీ మెజార్టీ సాధించింది.

### హామీలన్నీ నెరవేరుస్తా



శాసనసభకు జరిగిన ఎన్నికల్లో తనకు ఘన విజయాన్ని అందించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలతో పాటు ఆరు గ్యారెంటీలను మొదటగా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినందున ప్రభుత్వంతో మాట్లాడి అధిక నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

- మల్‌రెడ్డి రంగారెడ్డి